క్లుప్తంగా

రేపు మంత్రి నాదెండ్ల సమావేశం

కొల్లిపర: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటలకు వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో 3 గంటల కల్లా తప్పక హాజరు కావాలని తెలిపారు. హాజరు కాని అధికారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

అనారోగ్యంతో నాటక కళాకారుడు శివరావు మృతి


బూదాటి శివ నాగేశ్వరరావు(ఫైల్)

ఐలవరం(భట్టిప్రోలు): మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన నాటక కళాకారుడు బూదాటి శివ నాగేశ్వరరావు(శివరావు-67) గురువారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి చరిత్ర నాటకంలో ఏకాంబర యోగిగా, శ్రీ లక్ష్మి తిరుపతమ్మ నాటకంలో శ్రీ వేంకటేశ్వరునిగా, కృష్ణ కుచేల నాటకంలో శ్రీకృష్ణుడిగా అనేక పాత్రలు ధరించారు. నంది నాటకోత్సవాల్లో బహుమతులు పొందారు. భజన కళాకారుడిగా కూడా మంచి గుర్తింపు పొందారు. ప్రస్తుతం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అలాగే నగర సంకీర్తన సభ్యులుగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. శివరావు మృతి పట్ల దీపాల సత్యన్నారాయణ, జంజనం హేమ శంకరరావు, దీపాల సుబ్రహ్మణ్యం, కొతరపు శివశంకరరావు సిద్ధాంతి, మాచర్ల రంగారావు, వి.కోటేశ్వరరావు, కేబీవీ రమణ తదితరులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

మురుగు పారుదలకు చర్యలు

తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వల్లో పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. 28, 9 వార్డులతో పాటు 11వ వార్డులోని గురువయ్య కాలనీలోని డ్రెయిన్స్‌ను గురువారం ఆయన పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడ నీరు పొంగి పోర్లకుండా చూడాలని సూచించారు. కాల్వల్లో ఉన్న వ్యర్థాలను తొలగించాలని సిబ్బందికి చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాజీ, శ్రీనివాస్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

స్కూల్ బ్యాగులు, స్కాలర్‌షిప్‌ల పంపిణీ



తెనాలి: స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, బ్యాగులు అందజేశారు. కుమార్ గ్రూప్ సంస్థలకు చెందిన కుమార్ వాటర్ వర్క్స్ విరాళమిచ్చారు. సంస్థ అధినేత కొత్త సుబ్రమణ్యం సోదరి నాగరత్నమ్మ, పాఠశాల అధ్యక్షుడు హనుమంతరావు, కార్యదర్శి దూళ్ల నరసింహారావు, సమితి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సామల లక్ష్మణబాబు కోడూరు రమాదేవి, ప్రాంత పర్యావరణ ప్రముఖ్ పాత్తూరు ఆదిశేషయ్య, పాఠశాల ఆచార్య బృందం పాల్గొన్నారు. కుమార్ పంప్స్ నుంచి హరికుమార్-రత్న దీప్తి దంపతులు పంపిణీ చేశారు. మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీ విద్యా పీఠంలో విశేష హోమాలు



తెనాలి: స్థానిక గంగానమ్మ పేటలోని శ్రీ విద్యా పీఠంలో సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ నవగ్రహ సహిత, శ్రీ నక్షత్ర సంపూర్ణ శాంతి మహా యజ్ఞం కొనసాగుతోంది. 8వ రోజు గురువారం గణపతి పూజ, రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హమం, నక్షత్ర శాంతి హోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. యల్లాప్రగడ పవన్ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. బాలస్వామి అనుగ్రహ భాషణ చేశారు. అనూరాధ నక్షత్రం గురించి ములుకుట్ల విశ్వనాథ శర్మ ప్రసంగించారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకటకృష్ణ మూర్తి, ట్రస్ట్ సహాయ కార్యదర్శి ముద్దా భక్తుని రమణయ్య, రావూరి సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరరావు, ఉప్పల విశ్వనాథం, ఏలూరి రాజేశ్వరరావు, చుండూరు లోకనాథం పాల్గొన్నారు. సాయంత్రం ఉభయ దేవేర్లతో శ్రీవారికి విశేష ద్రవ్యాలతో తిరుమంజనం, గోవింద నామార్చన, విశేష హారతులు, ప్రసాద వితరణ చేశారు.

పిల్లలందరూ బడిలో ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు


ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ జయంతిబాబు, సీఆర్పీ శ్రీదేవి

కొల్లిపర: ప్రతి గ్రామంలోని పిల్లలందరూ బడిలో చేరి, చదువుకునేలా విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్ఎంటీలు కృషి చేయాలని ఎంపీడీఓ వి.విష్ణుప్రసాద్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'నేను బడికి పోతా' కార్యక్రమంపై గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ విష్ణు ప్రసాద్ పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి అధికారులు వెళ్లి బడికి రాని పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. పిల్లలను బడిలో చేర్పించి, బడి బయట పిల్లలు లేని మండలంగా చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జి.సాల్మన్‌రాజు, కె.ఝాన్సీ లత, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీ పిడపర్తి రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

తెనాలిఅర్బన్: బండి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలని మండల విద్యాధికారి-2 వి.జయంతిబాబు పేర్కొన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఇస్లాం పేటలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బండి ఈడు పిల్లల గురించి ఆరా తీశారు. ఇంకా పాఠశాలలో చేరని విద్యార్థులను గుర్తించి, వారిని పాఠశాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్రీదేవి, మున్షీ మస్తాన్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' ర్యాలీ..

తెనాలిరూరల్: పెదరావూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది గురువారం నేను బడికి పోతా కార్యక్రమం చేపట్టారు. ప్రధానోపాధ్యాయురాలు సరళ ఆధ్వర్యంలో విద్యార్థులతో 'బడిలో పిల్లలు-పనిలో పెద్దలు' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను బడికి పంపాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీజీతో క్షయవ్యాధి దూరం

ఫిరంగిపురం: బీసీజీ టీకా వేయించుకోవడం ద్వారా క్షయవ్యాధిని దూరం చేయవచ్చని వైద్యులు ఫరీనాబేగం, పి. ఎస్తేరురాణిలు అన్నారు. మండలంలో నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీల పరిధిలోని 18 గ్రామాల్లో గురువారం బీసీజీ టీకాలు వేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటివరకు 1,364 మందికి, ఫిరంగిపురం పరిధిలో 2,042 మందికి టీకాలు వేశామన్నారు. షుగర్ వ్యాధి ఉన్నా, బలహీనంగా ఉండి బరువు తక్కువగా ఉన్నా, గతంలో క్షయసోకినా, సోకిన వారికి దగ్గరగా ఉన్నా గుర్తించి వారికి ఆయాగ్రామాల్లో ఆరోగ్యసిబ్బంది టీకాలు వేశారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి గురువారం ఇదే ప్రక్రియ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమాలను సీహెచ్‌వోలు వెంకటలక్ష్మీ, వెంకటరమణ, హెచ్‌వీలు నూర్ ఖాజాబీ, అన్నమేరిలు పర్యవేక్షించారన్నారు.


వేమవరంలో వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

23న ప్రతిభా పురస్కారాలు

తెనాలి: శ్రీ వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 23న తెనాలిలోని ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు స్థానిక ముత్యంశెట్టి పాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఏర్పాటయే సభలో నగదు పురస్కారాలు, 125 మంది విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ, దుస్తులు పంపిణీ చేయనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ ఈఎల్‌వీ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

చారిత్రక ప్రదేశాల సందర్శనకు ఎన్‌సీసీ క్యాడెట్లు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్‌సీసీ క్యాడెట్లు చారిత్రక ప్రదేశాల సందర్శనకు గురువారం పయనమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని మాట్లాడుతూ ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాయంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, ఏపీ, తెలంగాణ రాజస్థాన్ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లకు చెందిన క్యాడెట్లు విజయవాడలోని సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలను సందర్శించేందుకు బయలుదేరారని తెలిపారు. కనకదుర్గ దేవాలయం, సామాజిక న్యాయ విగ్రహం, ఉండవల్లి గుహలను సందర్శించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సీఎస్ సిద్ధు, డిప్యూటీ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్ వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


కేఎల్‌యూ నుంచి బయలుదేరుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు

అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో అక్రమ కట్టడాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. తెనాలి పురపాలక సంఘ పరిధిలోని లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్‌తో గురువారం ఆయన చాంబరులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో జరిగే నిర్మాణాలన్ని ప్లాన్ ప్రకారం జరిగే విధంగా యాజమానులకు అవగాహన కల్పించాలన్నారు. నిబంధనల ప్రకారం ప్లాన్‌లకు ఆప్లై చేయించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు సుధాకర్, సుబ్బారావు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి

- చికిత్సకు రూ.16 కోట్లు అవసరం
- దాతల నుంచి సాయాన్ని అభ్యర్థించిన తల్లిదండ్రులు

నగరంపాలెం: దాతలు సాయం చేసి తమ కుమార్తె ప్రాణాలు కాపాడాలంటూ తల్లిదండ్రులు అభ్యర్థించారు. నగరంలోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో చిన్నారి తల్లిదండ్రులైన వి.ప్రీతమ్, గాయత్రి వివరాలు వెల్లడించారు. రాజమండ్రి కోటగుమ్మానికి చెందిన వి.ప్రీతంతో గుంటూరు నల్లచెరువు మూడో వీధికి చెందిన తూనుగుంట్ల గాయత్రితో వివాహమైంది. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. తొమ్మిది నెలలు కిందట గాయత్రి నగరంపాలెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆడ శిశువుకి జన్మనిచ్చింది. ఆమెకు హితైషిగా నామకరణం చేశారు. ఆరు నెలల వయసులో నేల మీద పాకకపోవడం, మెడ నిలబడకపోవడం, కూర్చోకపోవడంతో అదే ప్రైవేటు ఆసుపత్రిలో చూయించారు. నెల ఫిజియోథెరపీ చేయించాలని, మందులు రాసిచ్చారు, అయినప్పటికీ, పాప అలాగే ఉండటంతో మళ్లీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు సూచన మేరకు విజయవాడలోని మరో ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేయించగా, నివేదిక ఆధారంగా బెంగళూరు వైద్యులు అరుదైన వ్యాధి స్పైనల్ మస్కులర్ అట్రోఫి (ఎస్ఎంఏ)గా గుర్తించారని తల్లిదండ్రులు తెలిపారు. ఎనిమిది నెలల వయసులో వ్యాధిని గుర్తించారని, టైప్-1తో పోరాడుతోందని పేర్కొన్నారు. ఇది అరుదైన, ప్రాణాంతకమైన వ్యాధిగా వైద్యులు చెప్పారని తెలిపారు. దీని చికిత్సకు అందించే ఇంజక్షన్ విలువ రూ.16 కోట్లు అని, అది కూడా రెండు నెలల వ్యవధిలో జరగాల్సి ఉందని తెలిపారని పేర్కొన్నారు. గతంలో లక్ష మందిలో ఒకరికి, ప్రస్తుతం 10 వేల మందిలో ఒకరికి వస్తోందని వైద్యులు చెప్పారని వివరించారు. చికిత్స కోసం దాతల నుంచి ఆర్థిక సాయాన్ని అభ్యర్థించారు. నగదును ఆర్‌బీఎల్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 2223330038835175కు పంపించాలని కోరారు. సమావేశంలో పాప తాత తూనుగుంట్ల నాగేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు పాల్గొన్నారు.


చిన్నారి హితైషితో తల్లిదండ్రులు ప్రీతం, గాయత్రి

ఆర్టీఏ అధికారుల తనిఖీలు

15 బస్సులపై కేసు నమోదు



పట్నంబజారు: విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న పాఠశాలల బస్సులపై రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఆర్టీఏ) అధికారులు కేసులు నమోదు చేశారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బృందాలుగా ఏర్పడి గురువారం జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి, 15 బస్సులపై కేసు నమోదు చేశారు. అందులో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) లేకుండా తిరుగుతున్నవి నాలుగు, డ్రైవింగ్ లైసెన్సు లేనివి రెండు, 60 ఏళ్లు పైబడిన డ్రైవర్ ఒకటి, పర్మిట్ లేని రెండు బస్సులతో పాటు ఇతర నిబంధనలు పాటించనవి ఉన్నాయి. నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్న పలు బస్సుల్ని సీజ్ చేశారు.

తారకనాథ్ సేవలు చిరస్మరణీయం

కొరిటిపాడు: ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరీ తారకనాథ్ వర్ధంతిని గురువారం నగరంపాలెంలోని స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గుంటూరు మాడ్యూల్ పరిధిలోని అన్ని బ్రాంచీల్లో సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాపరిషత్ ప్రాంగణంలోని రామకృష్ణ శారదా విద్యాలయంలో పేద విద్యార్థులకు స్కూల్ యూనిఫాం అందించారు. కాజ గ్రామంలోని ఎస్‌కేసీవీ చిల్డ్రన్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని ఆమోదిని బాలికల హోంకు నిత్యావసర సరుకులు అందించారు. పొన్నూరు మండలంలోని బ్రాహ్మణకోడూరులో ఉన్న ఆర్ఫాన్ కేర్‌లో పేద బాలబాలికలకు నిత్యావసర సరుకులు అందజేశారు. సుమారు 130 మంది తాత్కాలిక సిబ్బందికి గృహోపకరణాల్ని సొసైటీ, యూనియన్ నాయకులు బహూకరించారు. గుంటూరు మెయిన్ బ్రాంచి ఆవరణలో గుంటూరు అర్బన్ రీజినల్ మేనేజర్ ఫణి కొండలరావు, మెయిన్ బ్రాంచి ఏజీఎం రామ్‌ప్రసాద్, ఇతర బ్రాంచి అధికారులతోపాటు మాడ్యూల్ డీజీఎస్ ఎన్. శ్రీనివాసాచార్యులు, ఏజీఎస్ కోటిరెడ్డి, నరేంద్ర, తారకనాథ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.


పేద విద్యార్థులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ ప్రతినిధులు

హాస్టల్ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



తెనాలి: ప్రపంచ శరణార్థుల దినోత్సవం సందర్భంగా జాతీయ మానవ హక్కుల పాలక మండలి ఆధ్వర్యంలో గురువారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ఎస్టీ బాలుర వసతి గృహంలో 40 మంది పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. జాతీయ మానవ హక్కుల పాలక మండలి జాతీయ కార్యదర్శి పల్నాటి నాగరాజు పాల్గొన్నారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. వైస్ ప్రిన్సిపల్ లక్ష్మణరావు అక్కడి పరిస్థితులను వివరించారు. వార్డెన్ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండు ఆవరణలో వర్షపు నీరు తొలగింపు


మోటార్ ద్వారా వర్షపు నీరు బయటకు పంపుతున్న సిబ్బంది


బస్టాండ్ ఆవరణలో పర్యటిస్తున్న కమిషనర్ శేషన్న, డీఎం రాజశేఖర్

తెనాలిఅర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండులో నిలిచిన వర్షపు నీరును బయటకు పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం మోటార్లు పెట్టి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రం చేశారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు బస్టాండు ఆవరణ జలమయమైంది. దీనిపై మీడియాలో వార్తలు ప్రసారం కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ బస్టాండ్ ఆవరణను పరిశీలించారు. ఆవరణంతా పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణ పల్లం కావడంతో వర్షపు నీరు నిలిచిపోతుందని తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆవరణ ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏసీబీ సుబ్బారావు, పలువురు మున్సిపల్, డిపో అధికారులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

తెనాలి రూరల్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ తెనాలి నియోజకవర్గ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. యూనియన్ తెనాలి సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని అతిథి హోటల్‌లో అధ్యక్షుడు చందు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులతో పాటు ఐజేయూ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెనాలి నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడిగా చందు సుబ్బారావు, కార్యదర్శిగా మేలేటి గోపిచంద్, ఉపాధ్యక్షులుగా టి.శరత్‌బాబు, ఎస్.ప్రసాదరెడ్డి, సహాయ కార్యదర్శులుగా బత్తుల కమలాకర్, కంకిపాటి రమేష్‌కుమార్, తన్నీరు కల్యాణ్ కుమార్, కోశాధికారిగా దీపాల సాయినాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిద్దుల సాయినాథ్ గౌరవ అధ్యక్షుడిగా బొల్లిముంత కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎం.వెంకటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హకీంజానీ, గన్ని కృష్ణ, కె.సురేష్, ఆర్‌వీ కిరణ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి యూనియన్ రాష్ట్ర నాయకుడు భక్తవత్సలం, ఐజేయూ సభ్యులు బీఎల్ నారాయణ, ఒ.మార్కండేయులు, జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మీరా, ఉపాధ్యక్షుడు చొప్పర సుధాకర్, సంయుక్త కార్యదర్శి కేజే నబీ, ట్రెజరర్ ఫణీంద్ర, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సునీల్ సందీప్, యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, ఎల్.వెంకటేశ్వరరావు, సునీల్, మురళి, మణికాంత్ తదితరులతో పాటు యూనియన్ తెనాలి నియోజకవర్గ సభ్యులు అభినందనలు తెలియజేశారు.


నూతన కమిటీతో యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన

తెనాలిరూరల్: చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో తెనాలి మండలం హాఫ్ పేట గ్రామంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక మాసం సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు ఇసుకపల్లి సుందరరావు మాట్లాడుతూ విద్యావంతులైన బాలల వలన మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. తెనాలి ఐసీడీఎస్ ప్రాజెక్టు కొలకలూరు సెక్టార్ సూపర్‌వైజర్ కె.యామిని, క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ జి.వెంకయ్య , సచివాలయం సెక్రటరీ రత్నకుమార్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వో వై.శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది చంద్రిక, రోమీల, అంగన్వాడీ వర్కర్ సుజాత, హెల్త్ వర్కర్స్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

పెదకాకాని: పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై నేతాజీ కోరారు. పెదకాకాని పుచ్చలపల్లి సుందరయ్యకాలనీలో గురువారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. పెదకాకాని పి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. సమావేశంలో నేతాజీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న వారికి పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం ఈవోపీపీఆర్డీ షేక్ సుభానికి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు చింతల శ్రీనివాసరావు, మండల సీపీఎం కార్యదర్శి ఎస్ శివాజీ, ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు దీవి నరసింహారావు, శేషగిరిరావు, ఎస్ లక్ష్మి, బుజ్జి, వి పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.


ఈఓపీఆర్డీ సుబానికి వినతిపత్రం అందజేస్తున్న వై.నేతాజీ తదితరులు

శరణార్థులను మానవత్వంతో ఆదుకోవాలి

లక్ష్మీపురం: యుద్ధాలు, తీవ్ర సంక్షోభాలు, హింసాత్మక ఘటనలు, ప్రకృతి వైపరీత్యాలతో స్వస్థలాలు వదిలి ప్రాణ రక్షణకు వలస వస్తున్న శరణార్థుల్ని కేంద్ర ప్రభుత్వం మానవత్వంతో ఆదుకోవాలని అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు, న్యాయవాది అవధానుల హరి కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిమిషానికీ ప్రపంచవ్యాప్తంగా 20 మంది శరణార్థులుగా నివాసాలు వదిలి ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుని ఇతర ప్రాంతాలు, దేశాలకు వలస వెళుతున్నారని తెలిపారు. నేడు భీకరంగా జరుగుతున్న రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయిల్ పాలస్తీనా యుద్ధాల వల్ల నేటికి దాదాపు 10 మిలియన్ల శరణార్థులు పొరుగు ప్రాంతాలకు వలస వెళుతున్నారని పేర్కొన్నారు. శరణార్థులపై కేంద్ర ప్రభుత్వం మానవత్వంతో వహించాలని కోరారు. కార్యక్రమంలో విద్యావేత్త ఎస్.రవిబాబు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సీనియర్ సభ్యులు ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది అవధానుల హరి

అరుంధతీ రాయ్‌పై 'ఉపా' ప్రయోగం సిగ్గుచేటు

అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులున్న రచయిత్రి అరుంధతీరాయ్ మీద పద్నాలుగు ఏళ్లనాటి ఓ కేసును తిరగదోడి ఆమె మీద ఏకంగా ఉపా ప్రయోగానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా అనుమతించడాన్ని ప్రతి ఒక్కరూ నిరసించాలని కొండా శివరామిరెడ్డి కోరారు.